# "కోరికల సంకెళ్లు"




సాయంత్రం అయిదు గంట లవుతోంది.

ఆ రోజు ఒకటో తారీఖు.

జీతం డబ్బులు కాక చిట్‌ఫండ్ అరవై రూపాయలు ఎక్‌స్ట్రా వున్నాయి విశ్వం జేబులో. 'బియ్యం షావుకారికి డబ్బు పూర్తిగా జమకట్టేస్తే మళ్ళీ నెలకు సరిపడే బియ్యం, సామాన్లు యిస్తాడు. అయిదు మాసాల క్రితం కొరదా పెట్టిన డబ్బు యిప్పటికీ తీర్చలేకపోయాడు. ప్రతి నెలా విశ్వానికీ - షావుకారికీ పెద్ద తగాదా. తను నడిరోడ్డు మీద చిన్నబుచ్చుకోవటం!'

దరిద్రులకు జీవితంలో యిలాటి అవమానాలు భరించటం పరిపాటే!

'ఛీ! పాడుడబ్బు. డబ్బు శాశ్వతమా? చచ్చేటప్పుడిదంతా కట్టుకు పోతామా?' టీవిగా దనుకోవలసినదే అనుకున్నాడు విశ్వం.

సాధారణంగా డబ్బుపై విరక్తి చెందేవాడు దరిద్రుడే!

'అనవలసిన మాటలు అని మరీ డబ్బు చేతిలో పెడతాను!' బియ్యం శెట్టిపై కసిగా అనుకున్నాడు.

బియ్యంషావుకారు బాకీ తీరిపోతున్నందుకు మనసులో చాల సంతోషించాడు.

అతని మనసు ఆనందంలో తేలియాడుతోంది!

అతని కళ్ళల్లో నూతన కాంతులు ప్రకాశిస్తున్నాయి! ఎందుకంటే కొన్ని అప్పులు తీరగలవని.

ఇంకా కొంత దూరం నడుస్తుంటే ఆఫీసు ప్యూన్‌గాడి కొడుకు సూరిగాడు ఠీవిగా టెర్లిన్ బట్టల యిన్‌షర్ట్‌తో మెరిసిపోతున్నాడు. నోట్లోనుంచి సిగరెట్టు పొగను స్టైయిలుగా వదులుతున్నాడు. వాడు విలువైన బట్టలతో వస్తూంటే విశ్వానికి ఆశ్చర్యం వేసింది. 'సూరిగాడు ... బంట్రోతు గాడి కొడుకు!' విశ్వంపెదాలపై ఆవేమాటలు పలుసార్లు వుచ్చరించ బడ్డాయి.

"వెధవ!...ఎంత?"

వాడ్ని చూస్తుంటే ఆశ్చర్యమల్లా క్రమంగా అసూయగా మారింది! వాడి బట్టలు తళతళ మెరిసిపోతోంటే తనవేపు జాలిగా చూచుకున్నాడు విశ్వం.

తనపై తనకే చెప్పరాని జుగుప్స కలిగింది!

మాసిపోయిన ఖద్దరు పేంటు...మూడు నాలుగు చోట్ల రఫ్ తీయబడ్డ షర్ట్!

డొక్క చీల్చితే అక్షరజ్ఞానంలేని వెధవకు...! బట్టల విలువ తీసేస్తున్నారు!

ఎదుటివాడి వస్త్రధనం చూచి సహించలేకపోవటం కొందరికి సైజమే అయినా, విశ్వంలో మాత్రం ఎదుటివాడు దర్పగా వున్నాడని బాధకాదు! తనకు లేదనే బాధ!

'అసలు నలుగురిలో తనకు విలువ లేకపోవటానికి కారణం మంచి బట్టలు లేకపోవటమే!'

'ఈ రోజుల్లో బట్టలు మనిషికి అందాన్నేకాదు కొంత సంఘ విలువల్ని కూడా పెంచుతుంది.

'ఆఫీసులో గుమస్తాలందరూ మంచి విలువయిన బట్టలే వేస్తారు! 'తను మాత్రం పట్టుకనుంచి యీ ఖద్దరుకే కంట్రాక్టు పాడేను!

అందరికీ ఆఫీసులోకి కాఫీ తెచ్చే ప్యూన్‌గాడు తను పిలిస్తేనే పలకకపోవడానికి కారణం ఇదే!

పైపెచ్చు ఓసారి అనేశాడు!

ఓ సారి...

పదిసార్లు పిలిచి నోరెండిపోయాక విసురుగా వచ్చిన ఆఫీసు ప్యూన్‌గాడ్ని కాఫీ తెమ్మంటే...

"మీకందరికి కాఫీలు తేటానికొచ్చేదుకాదు మేము ఆఫీసులో వర్క్‌ చేసేది...!"

వాడి విసురైన జవాబు, అహంకారమైన మాటలు విశ్వానికి చాల కోపాన్ని కల్గించాయి!

"అందరికీ తెచ్చేటప్పుడు ఆఫీసు ప్యూన్వికావా? ...నేను తెమ్మనేసరికి ఆఫీసు ప్యూన్వయ్యావేం?"

అంటూ రోషంతో పర్సులోంచి పావలానాణెం తీసి యిచ్చాడు. పావలా యిచ్చాడేకాని వాడా అయిదు పైసలు కమిషన్ కొట్టేస్తాడేమోనన్న అనుమానం లోలోన కొట్లాడుతూనేవుంది. పావలా కాసు సట్టు

తెల్ల పేపరు పైట్నీ విసిరినంత శబ్దంతో కాఫీగ్లాసు టేబులుపై పెట్టాడు బంట్రోతు. ఆ విసురులో కొంత కాఫీ త్రుళ్ళి విశ్వం బట్టల్ని దాగుచేశాయి. ఆరోజే బట్టలు మార్చుకొచ్చిన విశ్వంకి వొళ్ళు మండిపోయింది!

"కళ్ళు పొగరెక్కాయా?"

ఒక ప్రక్క చెప్పరాని కోపం ... మరోవైపు మట్టిపాలైపోయిందన్న కోపం పెలుకిన కంఠంతో

"అఁ!... మా బెర్లిన్ బట్టలా ఏటి? కద్దరు పీసులేకదా!" నిర్లక్ష్యంగా అంటూ వెళ్ళిపోయాడు.

చుట్టు ప్రక్కల వున్న క్లర్కులందరూ వెటకారంగా నవ్వారు. ఆ నవ్వుల్లో వారి అహంకారం...గర్వం ... విశ్వంపైగల చిన్న చూపు ద్యోతక మౌతుంది.

వారి నవ్వులు అగ్నిలో నెయ్యి పోసినట్లుగ అయింది!

నడుం విరిగిన నాగు పాముకు తోక మట్టినట్లయింది! వాళ్ళ నవ్వులు తనలేమిని జ్ఞప్తికి తెచ్చి మరింత హృదయక్షోభను కలిగించాయి! అదే ఆఫీసు ప్యూన్‌గాడిచే కాఫీ తెప్పించుకునే ఆఖిరోజు!

తన స్థితిని తలంచుకొని క్రుంగిపోయాడు.

'ఎన్నాళ్ళీ దారిద్ర్యంతో నలిగిపోవటం?

"నా సరదాలు... కోరికలు అన్నీ యీ దారిద్ర్యానికి దాసోహమై పోవలసిందేనా?

"లోకంలో కొందరు పూర్తిగ బాధలను భరించటానికే పుడతారు. అందులో నేనొకణ్ణి! ఈ దారిద్ర్యం ప్రాణంతో పోవలసిందే కాని ... జీవించి వుండగా పోయేదేంకాదు!

"భగవంతుడు నన్ను కష్టాలనుభవించటానికే పుట్టించాడు...కాని సుఖాన్ని పొందటానికి పుట్టించలేదు."

"లేదు...నా సుఖం ఎవ్వరికీ యిష్టం లేనట్లే కన్పడుతుంది."

కన్నతల్లి 'మందులు....మందులు!' ఒకటే గోల.

"నాన్న జబ్బుతో మూల్గుతుంటే ... నాన్నకు సరిపోయే మందులన్నీ కొంటూంటూనే అమ్మగోల తగ్గుతుంది."

నా సుఖం అమ్మ కవసరం లేదు!

అమ్మకు కావలసింది నాన్న మందులు!

సమయానికి పట్టెడన్నం పెట్టకపోతే 'ఆకలి ...ఆకలి!' పిల్లల గోల. పైళ్ళ గోలనుంచి తేలి కాస్సేపు విశ్రాంతి తీసుకుందామంటే గుండెలమీదెక్కి మరీ అల్లరి చేస్తారు పిల్లవెధవలు!

వాళ్ళ వల్ల మరీ బాధ!

ఇక వెళ్ళగానే కాస్త కాఫీ నిచ్చేది తన భార్యే అయినా...తను సుఖంగా ఉండటం...ఆనందంగా వుండటం ఆమె కిష్టమో కాదో తనకు మాత్రం తెలియదు!

ఒక్కసారయినా మంచి బట్టలు కుట్టించుకోమని చెప్పదేం? ఛీఛీ! ఇందరికి నా సుఖం అవసరం లేనప్పుడు నే నొకరి సుఖం కోసరం బాధపడటమేం ఖర్మ?

అయినా...

కన్న తలిదండ్రుల నింటినుండి పొమ్మనలేదు!

వాడు వెళ్ళిపోతామన్నా (ఎవరైనా) అంతకన్నా ఆ బంధాల్ని త్రుంచుకో లేడు!

ఒకవైపు కట్టుకున్న భార్య — సూర్యచంద్రులుదయించకపోయినా ఫర్వాలేదు...కాని...!

పిల్లలు...వాళ్ళే సర్వస్వం!

మరి తనకు సుఖం ఎలా వస్తుంది?

వారందరూ తనవద్దనే ఉండాలి! తనే పోషించాలి! తనకు చెడ్డపేరు రాకూడదు.

ఆ పక్షంలో తను ఆర్థికంగా సుఖం అనుభవించలేడు!

ఆర్థికబాధతో నలిగిపోయేమనిషికి మానసికంగా మాత్రం సుఖం ఎలా వుంటుంది?

పోనీ... వైరాగ్యంవాదం అంటే...

తల్లి...తండ్రి...భార్య...బిడ్డలు...

వారందరికంటె గొప్పది... విలువైనదీ ఆ ఉద్యోగమే!

ఆ ఉద్యోగంలేనిదే వాళ్ల బ్రతకలేరు!

వాళ్ళులేనిదే తను సుఖించలేడు!

కాని...వంద కోర్కెలలో ఒక్కటైనా తీర్చుకోలేనివాడు తనెందుకు మానవుడిగా జీవించాలి?... ఎలా జీవించగలడు?

ఏ మానవుడూ ఇతరుల సుఖాలకోసం తాను బలైపోడు!

కొంతవరకూ తన కోర్కెలు నెరవేర్చుకుంటూనే యితరుల క్షేమాన్ని కాంక్షిస్తాడు!

విశ్వం తలకాయ ఆలోచనలతోనే వేడెక్కిపోతోంది!

తనూ విలువైన బట్టల్తో అందరితో స్టైలుగా బ్రతకాలి! తిండిలేకపోతే ఇంట్లోపడి ఏడ్వవచ్చు! కానిబట్టలు సరియైనవి లేకపోతే నలుగురిలో స్టైలుగా బ్రతకలేం!... బిచ్చగాళ్ళతో సయితం చిన్నచూపు చూడబడతారు!

విశ్వంలో ఏవోతియ్యని కోరికలు పల్లవించాయి.

జేబులో డబ్బు చూసుకున్నాడు.

సూటిగ 'కాత్ మ్యూజియం'కు వెళ్ళాడు. బట్టల షాపు వాళ్ల కూడా మనుషుల వాలకాన్ని చూసే బట్టలు చూపుతారు.

ముందు బండి పద్నాలుగణాల రకం గుడ్డలు చూపెట్టాడు. విశ్వానికి వాట్ని చూసేసరికి కోపం తారస్థాయి నందుకుంది. "బెర్లిన్ పీసెస్ చూపెట్టవయ్యా!" చిరాగ్గా అన్నాడు. వాడు ఓ డజను గుడ్డలను తెచ్చి ముందు వేశాడు. అందులో ఏ గుడ్డ తీసుకోవాలో తెలియని అయోమయ స్థితిలో పడ్డాడు. అన్నీ తీసుకోవాలన్పించింది! కాని తీసుకోలేడు!

అందులో మంచిది ఎన్నుకొన్నాడు!

'మీటరు నలభై అయిదు రూపాయలు చెప్పాడు వాడు.

విశ్వం కళ్ళు బైర్లెక్కాయి! వొళ్ళంత కొద్దిగా చెమటలు పోసాయి. ప్రతి నరంలోంచి వేడి గాడ్పులు వసుగెత్తుతున్నట్లుగ అయింది!

ఫేంటుకి, షర్టింగ్‌కి ఓ ఎనభై రూపాయల్లో పీసులు తీసుకున్నాడు! భార్యకు ఓ టెరికాటన్ చీర, జాకెట్టు గుడ్డ తీసుకున్నాడు! ఆనందంతో పొంగి పోయాడు.

'చంద్ర మండలాన్నధి రోహించేముందు ఆంస్ట్రాంగ్ పొందేటంత ఉబలాటం పడ్డాడు - బెర్లిన్ యుగంలో ప్రవేశించ బోతున్నందుకు!'

రెండో మూడో ఎక్కువయినా బట్టలు అప్పుడే కుట్టించి తీసుకుపోయాడు! అప్పటికి సుమారు తొమ్మిది యవుతుంది. పట్టరాని ఆనందంతో యింటికి పరుగులు తీశాడు. కొత్త బట్టలు లలిత చేతుల్లోనుంచి గట్టిగా ముద్దుపెట్టుకోవాలనుకున్నాడు ఆమెని. సెకెండుషోకి ప్రోగ్రాము వేసుకున్నాడు.

లలితను పిలిచి ఆనందపారవశ్యంచేత మాటలు రాక ఆమె చేతుల్లో నుంచాడు. లలిత బట్టల్ని చూచింది.

కాని ......

త ననుకున్నట్టు ఆమె కళ్ళల్లో మెఱుపు తీగ తళుక్కుమనలేదు! ఆమె చూపుల్లో 'వీట్నిధరించే శాహతు మనకు లేదు!' అన్న భావన మాత్రం తొంగిచూస్తుంది!

మూడు నిమిషాలు మౌనంగా పూరుకుంది.

"ఏమండీ! ఇంత డబ్బునిచ్చి యివ్వి దెందుకని కొన్నారు?" అని మాత్రం అన్నది.

"మనమూ మనుషులమే నని...మనకూ కోరికలుంటాయని ... ఒకరి కోసం మన కోరికల్ని బలి చేసోక్కలేమని!" పౌరుషంగా,ఆవేశంగా అన్నాడు.

లలిత భర్త మనస్సు నర్థం చేసుకోలేందేం కాదు. మరే మనలేదు.

"చాల బావున్నాయండీ!"అని మాత్రం అంది. కాని ఆ మాటల్లో వినబడే ఆనందం ఆమె కళ్ళలో కన్పించలేదు విశ్వంకు.

విశ్వం బట్టలను చూచి 'మీకు చాల బావుంటాయ్!' అని కొంతసేపు పోయాక "కాఫీ పెట్టి తెస్తా నుండండి" అంటూ అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయింది.

"ఛ! ఇంకా కాఫీ ఏంటి నీ ముఖం!" అని భార్యను చేయపకు తీసికొని చెవిలో ఏవోచెప్పాడు. లలిత కదేమంత యిష్ట మనిపించలేదు! అయినా రెండు మూడు సంవత్సరాల నుంచి భర్త మరీ ఆర్థికంగా లొంగిపోవటం సరదాలను పూర్తిగ మరచిపోవటంచేత కాదన లేకపోయింది.

భర్త ఆనందం తనకు కావాలి!

భర్త సుఖం తనకు కావాలి!

చికాకులు...ఆపదలు ఎప్పుడు వుంటున్నవే! దరిద్రులకు వాటికి ఏదో అవినాభావ సంబంధం వుంటునే వుంటుంది.

విశ్వం టక్ చేసుకొని అద్దంలో చూచుకున్నాడు! తన అందానికి తనే మురిసిపోయాడు!

ఇన్నాళ్ళు అద్దంలో తన ప్రతిబింబాన్ని చూచి తనే భయపడేవాడు...అసహ్యించుకునేవాడు!

ఇప్పుడు తన అందాన్ని చూచి పారవశ్యం చెందుతున్నాడు! ఇన్నాళ్ళు ధనవంతులే సౌందర్యవంతులనుకునేవాడు!

ఇప్పుడు దరిద్రుల్లో(బీదవారిలో)కూడా సౌందర్యవంతులు వుంటారని (వారు సౌందర్యంలో దరిద్రులు కారని) బరువు బాధ్యతల వొత్తిడికి నలిగిపోవటంచేత వారిలో అందం నిగూఢంగా వుంటుం

దని అనుకున్నాడు!

'ఇప్పుడు నేను మనిషిని!' సగర్వంగా అను కున్నాడు. ప్యూన్‌గాడు కాఫీయేకాదు..ఏంతెమ్మన్నా తెస్తాడు!

ఈనాటికి నా జీవితం ధన్యమయింది!

"లలితా! నేనెంత అందంగా వున్నాను!" మనో భ్రమించిన వాడిలా అన్నాడు.

"మీరో ఎప్పుడు మాత్రం అందం తక్కువ?" అంది భర్త మాటలకు లోలోన నవ్వుకుంది.

* * *

అఫీసుకెళ్తుంటే బియ్యంశెట్టి అనే మాటలు, పొందిన అవమానాన్ని తలంపుకు వచ్చి బాధతో నలిగిపోయాడు. "...చాలు చాల్లేవయ్యా! మా పెద్దమనిషిలాగ కబుర్లు చెప్పి అప్పుతీసుకెళ్ళి సగం డబ్బు చేతిలో పెట్టడానికి నీకు సిగ్గు లేదయ్యా! అవంల్పించితెచ్చి మీకరువులిచ్చింది దివాలా తీయటానికి అనుకున్నావా? ఏ ముఖం పెట్టుకొని యింకా అరువు యిమ్మంటున్నావయ్యా ... వెళ్లు వెళ్లు! నువ్వు డబ్బెలాయిస్తావో నేనూ చూస్తాను. పూర్తిగా యిచ్చావో మర్యాదగా వుంటుంది, లేదా, ఆ డబ్బెలా రాదో నేనూ చూస్తాను!"

వాడి మాటలు తల్చుకుంటే విశ్వంకు ఒడలు జలదరించినట్లయింది! ఎంత మర్చిపోదామను కున్నా మర్చిపోలేక పోతున్నాడు. తలచుకొని సహించలేకపోతున్నాడు. ఒకసారి పెర్లిన్ బట్ట వేపు చూసుకున్నాడు! ఆనందం దుఃఖం ఒక్కుమ్మడిగా పొంగి వచ్చాయ్. ముఖం పైన అక్కడక్కడా క్రమ్మిన చెమట బిందువులను రుమాలతో తుడ్చుకున్నాడు. 'బోను వస్తుంది ఇచ్చేస్తానని చెప్పాడు. రావలసిన బోనుకూడా రాలేదు!... గడువుకూడా ఎన్నాళ్ళోలేదు!' వొళ్ళు సారిభయం వేసింది. షావుకారు ఈ నెలంతో సామాన్లుకూడా యియ్యలేదు! ఏం చెయ్యాలో తోచలేదు!

తన జీవితంలో నూతనాధ్యాయం ఆరంభమయిందనుకున్నాడు- కాని

లేదు... జీవితం పునరావృతం అవుతోంది!

మళ్ళీ అవమానాలు తప్పవు!... పస్తులు తప్పవు!!

ఆఫీసు మెట్లెక్కేసరికి ప్యూన్‌గాడు వింతగా 'గంగిరెద్దు'ను చూచేట్లు చూస్తున్నాడు!

'అన్న వీడి తస్సాదియ్యా!... వీడికెక్కడి దిరా యీ బట్టలు?' అన్నట్లుగా వుంది వాడి చూపు.

"ఏం టండోయ్! ఏంటి విశేషం?" రామం పలుకరించినా నిర్లక్ష్యంగా వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు.

తర్వాత ఆఫీసు క్లర్కుల గుసగుసలు విని వూరుకోలేక పోయాడు, అయినా ఏం చెయ్యాలేక పోయాడు!

పేదవాళ్ళ చేతిలో ఒక విలువైన వస్తువుంటే ధనవంతులకది చిన్నతన మనిపిస్తుంది!

ధనవంతులదృష్టిలో దరిద్రులు పేదపురుగులు!

"ఏంటిగురూ! మనిషంతా కొత్తగా కనిపిస్తున్నావు?" ఒక క్లర్కు వింకో క్లర్కు నుద్దేశించి.

"లాటరీ పేలినట్లుంది గురు!" ఇంకో క్లర్కు.

విశ్వంని గేలిచేస్తూ తక్కినగుమస్తాలు వాళ్ళలో వాళ్లు అనుకోసాగారు. ఆ విసుళ్ళన్నీ తన మీదేనని విశ్వానికి తెలిసినా, నిశ్శబ్దంగా వూరుకున్నాడు. తనలో అనుకున్నాడు. "వీళ్ళకి వుద్యోగం మీద ఖాతర లేదు. వీళ్ళకి తగలేసినంత డబ్బు వీళ్ళ తాత ముత్తాతలు గడించి పడేశారు.

'వీళ్ళు తమ విలాసాలకోసం యీ వుద్యోగాలు కొస్తారు!' ఒకడు మినిష్టర్‌గారి బావమరిదైతే, యింకొకడు ఛైర్మన్ గారి అల్లుడు. అందుకే వాళ్ళలో ఎన్ని లోటుపాట్లున్నా అడిగే నాథుడు లేక పోతున్నాడు! పాడు ప్రభుత్వం. వీళ్ల తిక్కలేక చచ్చిపోతున్నారనా యిస్తోంది వీళ్ళకి వుద్యోగాలు!" చిన్నగా నిట్టూర్చాడు.

దారిద్ర్యమనే మంటకు నెత్తురుపేరెక్కి సెగలు సెగలుగా కక్కుతున్న ఆవిరిలా వున్నదా వేడి నిట్టూర్పువాయువు! జరిగిన అవమానాల్ని రాదోమే ఆపదలని తలుచుకుని విచారంతో పరాగ్గా నేలవేపు చూస్తూండిపోయాడు.

చచ్చిపోయి. రెక్క లూడిపోయిన రెక్కపురుగుని చీమలు యీడ్చుకొని పోతున్నాయి.

తనకీ - ఆ 'రెక్క పురుగు'కి భేదం ఏమీ కన్పించలేదు విశ్వంకు.

అది ప్రాణం లేకపోగా చీమలచేత యీడ్చుకు పోబడుతోంది!

తను బ్రతికి వుండగానే దారిద్ర్యంచే పీల్చుకు తినబడుతున్నాడు!

దాంట్లో రక్తం లేదు!

తింటున్న ఉపవాసాలకీ - అనుభవిస్తున్న ఆపదలకీ తనలో కూడ నెత్తురు ఏనాడో గడ్డకట్టుకు పోయింది!

అది శవం! ... తను జీవచ్ఛవం!!

దానికీ - తనకీ భేదం అంతే!!!

* * *

"ఏమండీ! బియ్యం యీ పూట కున్నాయి." కాఫీగ్లాసు చేతి కందిస్తూ ఆఫీసుకు బయలు దేరిన భర్తకు (రాత్రి బియ్యం లేవన్నట్లుగ) బెదురుగా చెప్పింది లలిత.

విశ్వం నెత్తిమీద పెద్ద బండరాయి పడ్డట్లయింది! ముఖం పూర్తిగ పాలిపోయింది!

"ఇంకా ప[illegible]!" గుండె గుభిల్లుమంది.

"భగవాన్! ఈ నెలల్లా గడుపను తండ్రీ!" కళ్ళల్లో నీటిసుళ్ళు గిర్రున తిరిగాయి. పెర్లిన్ చొక్కావేపు జాలిగ చూడుకున్నాడు.

"అప్పుల బాధనుంచి తప్పించుకొని ప్రశాంతంగ వుండాలనుకుంటే...ఇన్నాళ్ళులేని ఈపాడు కోరిక ఎందుకు కల్గింది?" బుర్ర పిచ్చెత్తినట్లుగ అయింది!

సూరిగాడు కొడుకు జ్ఞప్తికి వచ్చాడు.

'అవును! వాడు గంజినీళ్ళు త్రాగి బ్రతుకగలడు! తను తన పిల్లలు అంత నికృష్టంగా బ్రతకలేడు! వాడు గంజినీళ్ళు త్రాగుత్తే పెర్లిన్ తొడగగలుగుతున్నాడు!' పైకిగా అనుకున్నాడు.

'ఎన్ని తిట్లు కాసినా, మళ్ళీ ఆ షావుకారిగారి పాదాలనే ఆశ్రయించాలి! తప్పదుమరి!' మెల్లగా గొణుక్కుంటూ గ్లాసు క్రింద పెట్టాంటే "నాన్నా! మీ కోసం ఎవరో వచ్చారు!" అయిదేళ్ళ పాప వచ్చి చెప్పింది.

"ఆఫీసు కెళ్తాస్తా!" లలితకు చెప్పి వీధిగుమ్మం వద్దకు వచ్చేసరికి బియ్యం షావుకారి గుమస్తా యమభటునిలా నిలబడి వున్నాడు. వాడు కనీసం ఓ నమస్కారం అయినా పెట్టకుండానే "నాటిగ షావుకారుగారు అర్జంటుగ డబ్బియ్యమన్నారు. యివాళ పెళ్ళాలిట! లేదా మిమ్మలనైనా తొడ్కొని రమ్మన్నారు!" సైకిలు తాళంతీస్తూ అన్నాడు.

'కోరికలందరికీ సహజమే అయినా, తాహతుకు తగ్గ కోర్కెలనే తీర్చుకొని సంతృప్తిచెందాలి. తాహతును మించిన కోరికలు అనుభవిద్దామని ప్రయత్నిస్తే, ఆ కోరికలే సంకెళ్ళయి మనిషిని పట్టివేస్తాయి!' మనసులో అనుకున్నాడు విశ్వం.

"[illegible]ండి సార్! టైమయి పోతోంది!"

వాడి హెచ్చరిక వినేసరికి కళ్లు తిరిగిపోతున్నట్లయింది. ముఖం వెలవెల బోయింది. రక్త ప్రసారం ఆగినట్లు అవగా వర్షంపు శిథిలమై పోయిన మట్టిగోడలా కూలిపోయాడు నిలవునా!

★

